సాక్షి నల్లగొండ

సోమవారం । 2 । జనవరి । 2023



భగవంతుడి ఆశీర్వాదంతో..
భగవంతుడి ఆశీర్వాదంతో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు పోతుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 10లో



'మైసూర్ మల్లిక'తో ఆదాయం
మైసూర్ మల్లిక అనే వరి వంగడం సాగు చేస్తూ అధిక ఆదాయం ఆర్జిస్తున్నాడు రైతు చంద్ర వెంకటేశ్వరావు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 31.0°/20.0°
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రిపూట చలి మోస్తరుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సాగర్‌లో పర్యాటకుల సందడి



లాంచీ దిగివస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్ : సాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. నూతన సంవత్సరం కావడంతో పెద్ద సంఖ్యలో పర్యాటలకు సాగర్ తరలివచ్చారు. లాంచీలో నాగార్జున కొండకు వెళ్లి మ్యూజియంను సందర్శించారు. విద్యుదుత్పాదన కేంద్రం రోడ్డు వెంట, బుద్ధవనం, ఎత్తిపోతల తదితర ప్రాంతాల్లో సేద దీరారు. బుద్ధవనంలోని తపోవనం, జాతక వనం, స్థూపపార్కు, మహాస్థూపం తదితర ప్రాంతాలన్నీ పర్యాటకులతో నిండిపోయాయి.

అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ : పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నల్లగొండ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఎన్నికను రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాని, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా మాచర్ల జగ్జీవన్, ఉపాధ్యక్షుడిగా నాగరాజుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా శంబులింగం, కోశాధికారిగా పవన్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా మల్లేష్, ధర్మేందర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వరమ్మ, గణేష్‌ను నియమించారు. నూతన కార్యవర్గాన్ని నల్ల గొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో నజీర్, విజయ్, రాధ, విజయ, వాసుదేవరావు, మనోజ్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మరో పోరాటం



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ఎస్సీ వర్గీకరణ సాధనకు మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కత్తుల తులసీదాస్, జాతీయ కార్యదర్శి నకిరేకంటి అంజయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద 'హలో మాదిగా చలో నల్లగొండ' కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కార్యచరణపై నల్లగొండలో ఎమ్మార్పీఎస్–టీఎస్ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ భవనంలో నిర్వహించే జిల్లా సదస్సుకు మాదిగలు భారీగా తరలిరావాలన్నారు. ఎస్సీ వర్గీకరణపై గత 28ఏళ్లగా రాజీలేని ఉద్యమాలను జరుపుతుందన్నారు. ఈ సదస్సుకు జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌లు హాజరవుతున్నారని, ఈ సదస్సును విజయవంతం చేసేందుకు పెద్ద ఎత్తున మాదిగలు తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రామాంజి సైదులు, మారపాక నరేందర్, నూకపంగ కాశయ్య, ఇంద్రపల్లి శ్రీనివాస్, పరంగి రంజిత్, పెద్ద సైదులు, చంద్రయ్య, పాల్, సత్యం, శివ, లక్ష్మయ్య తదితరులున్నారు.

పులకించిన యాదాద్రి



ప్రసాద విక్రయ కేంద్రం వద్ద భక్తుల బారులు

యాదగిరిగుట్ట : నిత్యారాధనలు, భారీగా తరలివచ్చిన భక్తజనులతో ఆదివారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం పులకించింది. వేకువజామున 3 గంటలకే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం స్వయంభూలకు బిందె తీర్థం, ఆరాధన, బాలభోగం, నిజాభిషేకం, సహస్రనామార్చన చేపట్టి, తులసీ దళాలతో అర్చించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు, రాత్రి స్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

నూతనోత్సాహం



నల్లగొండలో న్యూ ఇయర్ కేక్ కట్ చేసి బెలూన్లు ఎగురవేస్తున్న ఎస్పీ రెమా రాజేశ్వరి



చింతపల్లిలోని సాయిబాబా ఆలయంలో బాబా దర్శనానికి బారులుదీరిన భక్తులు



శాలిగౌరారంలో పొలం వద్ద నూతన సంవత్సరం కేక్ కట్ చేస్తున్న కూలీలు

రైల్వే భూములు కబ్జా

- ట్రాక్ వెంట స్థలాలను ఆక్రమించి సాగు చేసుకుంటున్న రైతులు
- మిర్యాలగూడ – విష్ణుపురం మధ్యలో బలహీనపడుతున్న ట్రాక్
- ఈ రెండు స్టేషన్ల పరిధిలో రైళ్ల వేగం తగ్గింపు
- ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నా పట్టించుకోని రైల్వే అధికారులు



కొండ్రపోల్ రైల్వే స్టేషన్ వద్ద ట్రాక్ పక్కన సాగవుతున్న రైల్వే భూములు



మిర్యాలగూడ సమీపంలో ట్రాక్‌ల వెంట ఆక్రమణకు గురైన భూముల్లో వేసిన వరి నాట్లు

మిర్యాలగూడ : కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్లుగా మారింది రైల్వే భూముల వ్యవహారం. మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పరిధిలోని ట్రాక్ వెంబడి ఉన్న భూములను పలుచోట్ల కొందరు ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నారు. రైల్వే ట్రాక్‌ల వెంబడి భూములను ఆక్రమిస్తుండడంతో ట్రాక్‌లు బలహీనపడి కుంగిపోయే ప్రమాదం పొంచి ఉంది. ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఉంటుందన్న సోయి కూడా అధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ట్రాక్‌ల వెంట ఉన్న భూములను కాపాడాలని కోరుతున్నారు.

సాగర్ ఆయకట్టు కావడంతో..

సికింద్రాబాద్ నుంచి గుంటూరు జిల్లా నడికుడి రైల్వేస్టేషన్ల (సుమారు 195కి.మీ) మధ్యలో మిర్యాలగూడ రైల్వేస్టేషన్ ఉంది. ఈ ప్రాంతంలో రైల్వే ట్రాక్ వెంట విలువైన భూములు ఉన్నాయి. మిర్యాలగూడ ప్రాంతం ఎక్కువగా సాగర్ ఆయకట్టు కింద ఉండడంతో ట్రాక్ వెంట భూములను పక్కన ఉన్న రైతులు కలుపుకుని వరి సాగు చేస్తున్నారు. మిర్యాలగూడ – విష్ణుపురం రైల్వే స్టేషన్ల మధ్యలో ఈ ఆక్రమణ ఎక్కువగా ఉంది. ట్రాక్ వెంట ప్రైవేట్ వ్యక్తులు, రైతులు
రైల్వే అధికారులు పాతిన హద్దురాళ్లను సైతం తొలగించి లోపలికి వచ్చి భూములను చదును చేసి వ్యవసాయ పొలాలుగా మారుస్తున్నారు.

పట్టించుకోని రైల్వే అధికారులు..

ట్రాక్‌ల వెంట ఉన్న భూములు కబ్జాకు గురవుతున్నా రైల్వే ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప చర్యలు తీసుకోరా అని ప్రజలు రైల్వే అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఒక్కో రైల్వే గ్యాంగ్‌మెన్ 23 కిలోమీటర్ల మేర ట్రాక్‌ల వెంట పర్యవేక్షణ చేపడుతుంటారు. ఈ గ్యాంగ్‌మెన్‌లకు కబ్జారాయుళ్లు మామూళ్లు ముట్టజెప్పి ట్రాక్‌ల వెంట ఉన్న భూములను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏడాదిన్నర క్రితం సికింద్రాబాద్ రైల్వే జనరల్ మేనేజర్ పర్యటన సందర్భంగా రైల్వే స్థలాల ఆక్రమణ విషయాన్ని కొందరు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే పరిశీలించి కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోగా ఈ ఏడాది పూర్తిగా ట్రాక్‌ల వెంబడి భూములు మరింత కబ్జాకు గురయ్యాయి. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి కబ్జాకు గురైన రైల్వే భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడంతోపాటు కబ్జాదారులను కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి నిఘా

భూములు స్వాధీనం చేసుకుంటాం

రైల్వే భూముల ఆక్రమణ చట్టరీత్యా నేరం. ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా మిర్యాలగూడ, దామరచర్ల మండల రైల్వేస్టేషన్ల ప్రాంతంలో రైల్వే భూములను రాజకీయ నాయకుల అండదండలతో పలువురు కబ్జాదారులు ఆక్రమణకు పాల్పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. త్వరలోనే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటాం.

– రాంభద్రం, పర్మినెట్ వే ఇన్‌స్పెక్టర్

బలహీన పడుతున్న ట్రాక్..

గుంటూరు– సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య గతంలో ఎక్స్‌ప్రెస్ స్థాయి రైళ్లు మాత్రమే నడిచేవి. నాలుగేళ్ల క్రితం విద్యుత్ లైన్‌గా మార్చడంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లను సూపర్‌ఫాస్ట్ రైళ్లుగా అప్‌గ్రేడ్ చేశారు. ఇప్పుడు సుమారు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడుపుతున్నారు. అయితే ట్రాక్‌ల వెంట సాగు చేస్తున్న పొలాలకు నీరు పారించడం భూమి నానుతోంది. మరోవైపు వర్షాకాలంలో వరదలు సంభవిస్తే ట్రాక్ మరింత బలహీనంగా మారే అవకాశం లేకపోలేదు. దీంతో మిర్యాలగూడ – విష్ణుపురం మధ్యలో సూపర్‌ఫాస్ట్ రైళ్ల వేగం తగ్గిస్తున్నారు. ఈ ప్రాంతంలో గంటకు 50 కిలోమీటర్ల వేగంతోనే నడుస్తున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పేదలకు అర్ధాకలి

- ఈ నెల నుంచి రేషన్ బియ్యం 5 కేజీలే
- మరో ఏడాది పాటు ఉచితంగా ఇవ్వనున్న కేంద్రం
- కేంద్రం కోటానే పంపిణీ చేయనున్న ప్రభుత్వం
- 5వ తేదీ నుంచి లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశాలు



నల్లగొండ : రేషన్ బియ్యం ఇక నుంచి యూనిట్‌కు ఐదు కేజీలే అందనున్నాయి. కరోనా ప్రారంభం నుంచి చేపట్టిన ఉచిత బియ్యం పంపిణీని కేంద్రం మరో ఏడాది పొడిగించింది. దీంతో ఈ ఏడాది డిసెంబర్ వరకు కేంద్రం ఇచ్చే ఐదు కేజీలు లబ్ధిదారులకు అందనున్నాయి. ఈ నెల 5వ తేదీ నుంచి బియ్యం పంపిణీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. జిల్లాలో మొత్తం 4,66,939 ఆహార భద్రత కార్డుదారులున్నాయి. వాటిలో 14,01,820 యూనిట్లు ఉన్నాయి. ప్రతి యూనిట్‌కు 5 కేజీల చొప్పున బియ్యం పంపిణీ జరగనుంది. అందుకు సంబంధించి బియ్యం కోటాను కూడా ప్రభుత్వం కేటాయించింది.

కరోనా నుంచి ఉచిత బియ్యం..

కరోనా కాలంలో పేదలు ఆకలికి ఇబ్బందులు పడొద్దన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తూ వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం 5 కేజీలు, రాష్ట్ర ప్రభుత్వం 5 కేజీలు మొత్తం 10 కేజీల చొప్పున ప్రతి యూనిట్‌కు అందజేశాయి. కరోనా తగ్గాక కూడా ఉచిత బియ్యం పంపిణీని పొడిగించాయి. 2022 డిసెంబర్ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత బియ్యం ఇచ్చాయి. అయితే ఇప్పుడు కేంద్రం 2023 డిసెంబర్ వరకు ఉచిత బియ్యాన్ని పొడిగించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు 5 కేజీల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అందుకు సంబంధించి డీఎస్‌ఓలు, డీఎంలు బియ్యాన్ని దుకాణాలకు సరఫరా చేసి పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. అంటే ఈసారి రాష్ట్రం తన ఐదు కేజీలు ఇవ్వడం లేదని తెలుస్తోంది. కానీ, అంత్యోదయ అన్నపూర్ణ కార్డుదారులకు 35 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయనున్నారు.

బియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం

ఈ నెల 5వ తేదీ నుంచి ఉచితంగా 5 కేజీల బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు అందాయి. అందుకు సంబంధించి గోదాముల నుంచి రేషన్ షాపులకు బియ్యం రవాణా తదితర ఏర్పాట్లు చేస్తున్నాం. 5వ తేదీ నుంచి బియ్యం పంపిణీ ప్రారంభిస్తాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

గూడూరు టోల్‌ప్లాజాకు వాహనాల తాకిడి



టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

బీబీనగర్ : హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. నూతన సంవత్సరంతో పాటు సెలవు రోజు కావడంతో హైదరాబాద్ జంటనగరాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో యాదాద్రికి తరలివచ్చారు. ఈ క్రమంలో మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఉదయం, సాయంత్రం వాహనాలు బారులుదీరాయి.

ఆహ్లాదానికి ఆమడదూరం

- వినియోగంలోకి రాని దేవరకొండ మినీ ట్యాంక్ బండ్
- నిర్వహణ లోపంతో అస్తవ్యస్తంగా దర్శనం
- అందుబాటులోకి తేవాలంటున్న ప్రజలు



వ్యూ పాయింట్ వద్ద పెరిగిన కంపచెట్లు

దేవరకొండ : ప్రజలకు ఆహ్లాదం పంచే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన మినీ ట్యాంక్ బండ్ నిర్వహణ లోపంతో కొట్టుమిట్లాడుతోంది. దేవరకొండ మండల పరిధిలోని కొండభీమనపల్లి చెరువు వద్ద మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణం పూర్తయినా.. అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఎవరూ అటువైపు వెళ్లడం లేదు. దీంతో ఆ ప్రాంతం పిచ్చి మొక్కలు మొలవడంతో పాటు మద్యం ప్రియులకు అడ్డాగా మారి అస్తవ్యస్తంగా మారింది.

రూ.కోట్లు వెచ్చించి నిర్మాణం..

దేవరకొండ మండల పరిధిలోని కొండభీమనపల్లి చెరువుపై 2017లో రూ.6.32కోట్లతో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు చేపట్టారు. కట్ట వెడల్పు, ఫుట్‌పాత్, రెండు బతుకమ్మ ఘాట్లు, తూము, అలుగుల మరమ్మతులు, ఒక వ్యూ పాయింట్, రెయిలింగ్ వంటి పనులను చేపట్టారు. అయితే కార్పెట్ గ్రాస్ ఏర్పాటు, బెంచీలు, సీసీ రోడ్డు నిర్మిస్తే మరిన్ని హంగులు కల్పించాల్సి ఉంది. ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ నిర్వాహణ లోపం కారణంగా ప్రజలు అటువైపు రావడం లేదు.

కొరవడిన నిర్వహణ..

దేవరకొండ పట్టణానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండభీమనపల్లి చెరువుపై నిర్మించిన మినీ ట్యాంక్ బండ్ మందుబాబులకు అడ్డాగా మారింది. ఆ ప్రాంతంలో ఎక్కడ చూసినా పగిలిన సీసాలే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా నిర్వహణ చేపట్టడితే ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు వీలుంటుందని పట్టణవాసులు పేర్కొంటున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



మినీ ట్యాంక్‌బండ్ నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. ట్యాంక్‌బండ్‌పై కంపచెట్లు తొలగింపు, అవసరమైన పనులకు సంబంధించి అధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడుతాం. కాగా చెట్ల తొలగింపుతో పాటు చిన్న చిన్న పనులకు సంబంధించి ఉన్నతాధికారులకు గతంలో ప్రతిపాదనలు పంపించాం.

– నగేశ్, ఐబీ ఏఈ

ప్రభుత్వ పాఠశాలలకు హంగులు

- 'మన ఊరు – మన బడి' కింద అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం
- తొలి విడతలో 516 పాఠశాలల ఎంపిక
- ప్రతి మండలంలో రెండు మోడల్ స్కూళ్ల గుర్తింపు
- ఈ నెల 5వ తేదీ నాటికి పనులు పూర్తి చేసేలా ప్రణాళిక



రంగులు వేసిన మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి పాఠశాల

నల్లగొండ : ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ముస్తాబవుతున్నాయి. ప్రభుత్వం 'మన ఊరు – మన బడి' కింద పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. అందులో భాగంగా మొదటి విడతగా జిల్లాలో 516 పాఠశాలను ఎంపిక చేసింది. ఈ పాఠశాలల్లో అన్ని రకాల వసతులను సమకూర్చడంతోపాటు భవనానికి మెరుగులు దిద్దుతోంది. అయితే ఈ 516 పాఠశాలల్లో మండలానికి రెండు 64 మోడల్ పాఠశాలను గుర్తించి వాటిలో పనులు ఈ నెల 5వ తేదీ నాటికి పూర్తి చేసేలా యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి.

ప్రశాంత వాతావరణంలో విద్యనభ్యసించేలా..

విద్యాభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించింది. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో విద్యనభ్యసించేందుకు వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా 'మన ఊరు – మన బడి' పేరుతో పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఉన్న పాఠశాలలను విడతల వారీగా ఎంపిక చేసి మౌలిక వసతులు కల్పిస్తోంది. ఇందుకోసం దాతల సహకారం కూడా తీసుకుంటోంది. ప్రస్తుతం మొదటి విడతలో ఎంపిక చేసిన 516 పాఠశాలల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయి.

8న మోడల్ పాఠశాలలు ప్రారంభం

జిల్లాలోని ప్రతి మండలంలో రెండు మోడల్ పాఠశాలలు ఎంపిక చేశారు. వాటిని మొదటగా అభివృద్ధి చేసి ఈ నెల 5వ తేదీ నాటికి పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ మోడల్ పాఠశాలల్లో ఇప్పటికే 70శాతం వరకు పనులు పూర్తయ్యాయి. జనవరి 5 నాటికి మిగిలిన పనులు కూడా పూర్తి చేసి 8వ తేదీ లోగా ప్రారంభించుకోవాల్సి ఉంది.

కల్పిస్తున్న వసతులు ఇలా..

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదుల నిర్మాణంతోపాటు ప్రహరి గోడ, వంటగది, మరుగుదొడ్లు, విద్యుదీకరణ, తాగు నీటి వసతి, ఫ్యాన్ల ఏర్పాటుతోపాటు పాఠశాల భవనానికి రంగులు వేస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేకంగా ఇద్దరికి ఒక టేబుల్ బెంచి తరహాలో కలిపి ఉండే చైర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఉపాధ్యాయులు, హెడ్‌మాస్టర్‌కు ప్రత్యేకంగా ఫర్నిచర్ సమకూరుస్తున్నారు.

పనులు వేగంగా సాగుతున్నాయి



మండలానికి రెండు మోడల్ పాఠశాలల్లో ఈ 5వ తేదీ నాటికి అన్ని పనులు పూర్తవుతాయి. అక్కడక్కడ కొన్ని కారణాల వల్ల పనుల్లో కాస్త ఆలస్యమైంది. అయినా ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయి. 8వ తేదీలోగా వాటిని ప్రారంభించాలని ఆదేశాలు ఉన్నందున ఆలోగా పనులు పూర్తి చేసేలా చూస్తాం.

– భిక్షపతి, డీఈఓ

దేశ సేవను అదృష్టంగా భావించాలి

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



లింగారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

పెద్దవూర: దేశానికి సేవ చేసే భాగ్యం రావడం అదృష్టంగా భావించాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఇండియన్ ఆర్మీలో 19 సంవత్సరాల పాటు పనిచేసి పదవీ విరమణ పొంది ఆదివారం రాత్రి స్వగ్రామానికి వచ్చిన మండలంలోని బట్టుగూడెం వాసి లక్క లింగారెడ్డికి గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లుతూ, బాణసంచా కాల్చుతూ గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్సీతో పాటు పలువురు లింగారెడ్డిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. నూరుశాతం అక్షరాస్యత సాధించిన బట్టుగూడెంలో ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగస్తులుగా సేవలు అందిస్తున్నారని కొనియాడారు. లింగారెడ్డి దేశానికి చేసిన సేవ విలువ కట్టలేనిదని అన్నారు. కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, పెద్దవూర సర్పంచ్ నడ్డి లింగయ్య, ఎంపీటీసీ కత్తి మహాలక్ష్మీముత్యాల్‌రెడ్డి, సుంకిరెడ్డి సంజీవరెడ్డి, అల్లి పెద్దిరాజు, రాహుల్‌రెడ్డి, విజయారెడ్డి పాల్గొన్నారు.

మెట్ల మార్గం.. అంధకారం!



మెట్ల మార్గంలో సెల్‌ఫోన్ లైట్లతో వెళ్తున్న భక్తులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండపైకి వెళ్లే మెట్లమార్గంలో అంధకారం నెలకొంది. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో స్వామి సన్నిధికి వెళ్లడానికి భక్తులు నానా అవస్థలు పడుతున్నారు.చిమ్మచీకటి ఉండడంతో సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో కొండపైకి చేరుకుంటున్నారు. ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి రింగ్ రోడ్డులో అధునాతన విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసిన వైటీడీఏ అధికారులు.. కొండపైకి వెళ్లే మెట్ల మార్గాన్ని విస్మరించడంపై భక్తులు విమర్శలు చేస్తున్నారు.

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొట్టిన డోజర్.. వ్యక్తికి గాయాలు

పెన్‌పహాడ్ : బైక్‌ను వెనక నుంచి ట్రాక్టర్ డోజర్ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని జానారెడ్డినగర్ సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన అమరగాని సైదులు, అతడి స్నేహితుడు సాయిలు బైక్‌పై పని నిమిత్తం మిర్యాలగూడ వెళ్లి వస్తుండగా.. మండలంలోని చెట్లముకుందాపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డోజర్ జానారెడ్డినగర్ సమీపంలో వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైదులు తీవ్ర గాయాలపాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. సైదులు తల్లి జానకమ్మ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు డోజర్ డ్రైవర్ మామిడి వెంకన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి



సంఘటనా స్థలం వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌ఐ రమేశ్

చింతపల్లి: మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో పది నెలల వయసున్న చిన్నారి నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్‌ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన దశరథ కుటుంబం మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఓ భవనం వద్ద కూలీ పనులకు కుదిరారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి మాల్ వెంకటేశ్వరనగర్‌కు మకాం మార్చి నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ వద్ద నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం సమయంలో పది నెలల వారి చిన్నారి ఆడుకుంటూ నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. చిన్నారి మృతదేహంతో భార్యాభర్తలు హైదరాబాద్‌కు వెళ్లగా విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రమేశ్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. తిరిగి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ కొనివ్వలేదని విద్యార్థి ఆత్మహత్య



శివ (ఫైల్)

చింతపల్లి: బైక్ కొనివ్వలేదని విద్యార్థి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మండల పరిధిలోని నసర్లపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నసర్లపల్లి గ్రామానికి చెందిన అంకూరి శివ(16) మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అంకూరి కవిత భర్త యాదయ్య గతంలోనే మృతిచెందాడు. దీంతో కవిత గ్రామంలో కూలీ పనులు చేస్తూ ఒక్కగానొక్క కుమారుడిని పోషిస్తుంది. ఆదివారం ఉదయం తనకు బైక్ కొనివ్వాలని శివ మారం చేయడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన శివ రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

భువనగిరి ఖిలాపై సందడి

భువనగిరి: నూతన సంవత్సరంతో పాటు సెలవుదినం కావడంతో ఆదివారం భువనగిరి ఖిలాపై సందర్శకుల సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందర్శకులతో కోట పరిసరాలు నిండిపోయాయి. ఒక్క రోజే సుమారు 1,100 మంది వచ్చినట్లు అధికారులు వచ్చారని, సుమారు రూ. 8 వేల ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

అనుమతి లేకుండా న్యూ ఇయర్ ఈవెంట్

- అడ్వెంచర్ కోవ్ రిసార్ట్‌పై ఎస్‌ఓటీ పోలీసుల దాడి
- ఐదుగురు నిర్వాహకుల అరెస్ట్

బొమ్మలరామారం: అనుమతులు లేకుండా న్యూ ఇయర్ ఈవెంట్ నిర్వహిస్తున్న మండల పరిధిలోని తిరుమలగిరి గ్రామ సమీపంలో గల అడ్వెంచర్ కోవ్ రిసార్ట్‌పై ఎస్‌ఓటీ పోలీసులు శనివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించి పలువురిని అరెస్ట్ చేశారు. వివరాలు... అడ్వెంచర్ కోవ్ రిసార్ట్‌లో అనుమతులు లేకుండా న్యూ ఇయర్ ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఎస్‌ఓటీ పోలీసులు అక్కడకు వెళ్లారు. అక్కడ సుమారు 400మందికి పైగా ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, యువతీయువకులు మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. అయితే ఈవెంట్ నిర్వహణకు సంబంధించిన అనుమతి పత్రాలను చూపించాలని నిర్వాహకులను పోలీసులు అడగగా, వారు ఎలాంటి పత్రాలు చూపించలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఈవెంట్ నిర్వహిస్తున్నారని, 400మందికి పైగా యువతీయువకులు ఆన్‌లైన్‌లో ఎంట్రీ పాసులు కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఈవెంట్ నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.



తిరుమలగిరి గ్రామ సమీపంలోని అడ్వెంచర్ కోవ్ రిసార్ట్



పోలీసులు సీజ్ చేసిన డీజే, ఆటో

కేసు నమోదు..

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతి లేకుండా న్యూ ఇయర్ ఈవెంట్ నిర్వహించిన నిర్వాహకులపై ఆదివారం కేసు నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా యారకొండ మండలానికి చెందిన బొల్లెమోని వెంకటేశ్వర్లు, బొల్లెమోని శ్రీలత, బొల్లెమోని వేణుగోపాల్, నారాయణపేట్ జిల్లా మద్దూరు మండలానికి చెందిన కావలి అంజయ్యతో పాటు హైదరాబాద్‌లోని గౌలిపురకు చెందిన బోనే సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అయితే ఈ ఈవెంట్‌లో 75మంది మాత్రమే ఉన్నారని, వారు కూడా ఫ్యామిలీలతో హాజరయ్యారని, కానీ ఎలాంటి అనుమతులు లేకుండా డీజే పెట్టి ఈవెంట్ నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు రిసార్ట్‌పై దాడి చేసి డీజే సిస్టమ్‌తో పాటు ఆటోను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



మధు (ఫైల్)

తుర్కపల్లి: మండలంలోని గంధమల్ల గ్రామానికి చెందిన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. గంధమల్ల గ్రామానికి చెందిన వేముల సత్తయ్య, పద్మ దంపతులకు కుమారుడు మధు(19), కుమార్తె సంతానం. సత్తయ్య కుటుంబంతో కలిసి కొన్నిరోజుల క్రితం బతుకుదెరువు నిమిత్తం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ఈసీఐఎల్‌కు వలస వెళ్లి, అక్కడే చిన్నాచితక పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. న్యూఇయర్ సందర్భంగా డిసెంబర్ 31న మిత్రులతో కలిసి బయటకు వెళ్లిన మధు అర్ధరాత్రి సమయంలో ఇంటికి వచ్చి ఇంటి బయట ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు ఉదయం లేచి చూసేసరికి మధు విగతజీవిగా కనిపించడంతో బోరున విలపించారు. మృతదేహాన్ని గంధమల్ల గ్రామానికి తీసుకొచ్చి దహన సంస్కారాలు నిర్వహించారు.

సాగర్ ఎడమ కాలువలో యువకుడి గల్లంతు



సైదులు

నేరేడుచర్ల: నాగార్జునసాగర్ ఎడమ కాలువలో ఈతకు వెళ్లి యువకుడు గల్లంతైన సంఘటన ఆదివారం నేరేడుచర్ల మండల పరిధిలోని పత్తేపురం గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పత్తేపురం గ్రామానికి చెందిన మచ్చ సైదులు తన స్నేహితులతో కలిసి నాగార్జునసాగర్ ఎడమ కాలువలోకి ఈతకు వెళ్లాడు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో సైదులు కాలువలో కొట్టుకుపోయాడు. స్నేహితుల సమాచారం మేరకు స్థానికులు కాలువలో దూకి సైదులు కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. సైదులు తల్లి పున్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా సైదులు గతంలో కరెంట్ షాక్‌తో ఒక చెయ్యిని కోల్పోయినట్లు తెలుస్తోంది.

మఠంపల్లిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- బీరు సీసాలు, కర్రలతో దాడి చేసుకున్న యువకులు
- ఆరుగురికి తలలు పగిలి తీవ్రగాయాలు

మఠంపల్లి : మండల కేంద్రంలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న ఘర్షణల పరంపర పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపంతో అడ్డూఅదుపూ లేకుండా కొనసాగుతున్నాయి. శనివారం అర్ధరాత్రి స్థానిక ఎస్సీ కాలనీలోని చర్చిలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ప్రార్థనలు జరుగుతుండగా, మద్యం మత్తులో ఉన్న పలువురు యువకులు అక్కడకు వచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న మరో వర్గంతో యువకులు గొడవపడి ఒకరిపై ఒకరు బీరు సీసాలు, కర్రలతో దాడి చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాలకు చెందిన ఆరుగురికి తలలు పగిలి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన వల్లపుదాసు గణేష్, మామిడి నితిన్ వర్గాలు చర్చి సమీపంలో మాటామాట పెరిగి గొడవకు దిగారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు బీరుసీసాలు, కర్రలతో దాడి చేసుకోవడంతో గణేష్ వర్గానికి చెందిన నాగరాజు, గోపి, ప్రభుదాసు తలలు పగిలాయి. అదేవిధంగా నితిన్ వర్గానికి చెందిన మధు, శివ, బి. నితిన్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఇరువర్గాల ఒకరిపై ఒకరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బీరు బాటిళ్లతో విచక్షణారహితంగా దాడి

- ముగ్గురికి తీవ్రగాయాలు

నాగార్జునసాగర్ : మద్యం మత్తులో యువకులపై బీర్ బాటిళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. సాగర్ ఎస్‌ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. హిల్‌కాలనీకి చెందిన ముసి శ్రీకాంత్ తన పుట్టినరోజు సందర్భంగా స్నేహితులకు పార్టీ ఇచ్చేందుకు శనివారం ప్రాజెక్టు హౌజ్ అతిథిగృహంలో 104 నంబర్ రూంను అద్దెకు తీసుకున్నాడు. శ్రీకాంత్‌తో పాటు అతడి మిత్రులు రసూల్, బినహర్, సంతోష్, శ్రీనివాసాచారి రాత్రి రూంకు చేరుకుని పార్టీ చేసుకున్నారు. అంతకుముందే పొట్టిపోగు రాజా పని నిమిత్తం ముసి శ్రీకాంత్ బైక్‌ను తీసుకెళ్లాడు. అయితే బైక్‌లో పెట్రోల్ అయిపోవడంతో రాజా అతిథిగృహం వద్దకు వచ్చి శ్రీకాంత్‌ను బండిపై ఎక్కించుకుని పెట్రోల్ కొట్టించుకునేందుకు హిల్ కాలనీ బస్టాండ్ వెనుక రోడ్డులో గల పెట్రోల్ బంక్ వద్దకు బయల్దేరాడు. కొంతదూరం వెళ్లిన తర్వాత అక్కడే ఉన్న ఏడెనిమిది మంది యువకులు 'అరేయ్.. శ్రీకాంత్ నువ్వు ఎక్కువ చేస్తున్నావ్' అని శ్రీకాంత్‌ను తీవ్రంగా కొట్టారు. దీంతో శ్రీకాంత్ ఒక్కడే వారు పార్టీ చేసుకుంటున్న రూంకు తిరిగి వచ్చాడు. అప్పటికే రూంలో ఉండే రసూల్ తన కజిన్ బ్రదర్ షేక్ మీరావలి ఫోన్ చేయడంతో బయటకు వెళ్లాడు. శ్రీకాంత్ వెనుక నుంచే పొట్టిపోగు రాజాతో పాటు పొట్టిపోగు అఖిల్, అందుగుల రాహుల్, కత్తి విష్ణు, నాగార్జున అతిథిగృహం వద్దకు వచ్చి రూంలోకి దూరి శ్రీకాంత్‌తో పాటు బినహర్, సంతోష్, శ్రీనివాసాచారిని బయటకు లాక్కొచ్చి వారిపై దాడి చేశారు. దీంతో శ్రీకాంత్ వెంటనే రసూల్‌కు ఫోన్ చేసి తమను కొడుతున్నారని చెప్పడంతో అతడు తన కజిన్ బ్రదర్ మీరావలితో అక్కడకు వచ్చాడు. అప్పటికే శ్రీకాంత్ గొంతులో బీరు బాటిల్‌తో పొడవడంతో రక్తం కారుతోంది. ఎందుకు కొడుతున్నారని అడిగిన మీరావలిని బీరు బాటిల్‌తో విచక్షణారహితంగా పొడిచారు. అదే సమయంలో స్థానికుడు కామిని కార్తీక్ గొడవ జరుగుతుందని అక్కడకు వెళ్లగా అతడి పొత్తి కడుపులో కూడా పొడిచారు. స్థానిక జనమంతా అక్కడికి చేరడంతో దాడి చేసిన యువకులు పారిపోయారు. గాయపడిన షేక్ మీరావలి, కామిని కార్తీక్, ముసి శ్రీకాంత్‌ను స్థానిక ప్రభుత్వ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మీరావలికి 63 కుట్లు పడినట్లు డాక్టర్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



తీవ్రంగా గాయపడిన షేక్ మీరావలి



ముసి శ్రీకాంత్ గొంతుకైన గాయం

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): నూతన సంవత్సర వేడుకలను ఆదివారం సూర్యాపేట కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు కేక్ కట్ చేసి అధికారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, వెంకారెడ్డి, జెడ్పీ సీఈఓ సురేష్, సీపీఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, కలెక్టరేట్ ఏఓ శ్రీదేవి, బీసీ అభివృద్ధి అధికారిణి అనసూయ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శిరీష , జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామారావు, ఇతర శాఖల అధికారులు, టీఎన్‌జీఓ యూనియన్ నాయకులు తదితరులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



సూర్యాపేట కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్‌జీఓ నాయకులు

ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నిండాలి

- సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం: నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నిండాలని సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కేక్ కట్ చేశారు.జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి, ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పనిచేసే పోలీసు అధికారులు, సిబ్బంది ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.జిల్లా పోలీసులు అంతా కలిసిమెలసి సమన్వయంతో పనిచేయండ వల్ల ఎన్నో సంఘటనలు, కేసులలో 2022 సంవత్సరంలో లక్ష్యాలను చేరుకున్నామన్నారు. కేసుల దర్యాప్తులో పురోగతి సాధించామని, సాంకేతికతను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. 2023 సంవత్సరంలో నూతనోత్తేజంతో జిల్లా పోలీసు శాఖ ప్రజలకు ఉత్తమ సేవలు అందించడానికి కృషి చేయాలని, టీమ్ వర్క్ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్‌రెడ్డి రవి, సీఐలు శ్రీనివాస్, నరసింహ, పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచందర్‌గౌడ్, సీఐలు సోమ్ నారాయణసింగ్, రాజశేఖర్, శివశంకర్, పీఎస్టీ ప్రసాద్, రామలింగారెడ్డి, గౌరీ నాయుడు, ఆర్‌ఐలు నర్సింహారావు, శ్రీనివాస్, శ్రీనివాసరావు, గోవిందరావు, ఎస్‌ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులకు కేక్ తినిపిస్తున్న సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్

బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలి

సూర్యాపేట టౌన్ : రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు తక్షణమే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి తెలకలపల్లి పెంటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పిరమిడ్ ధ్యాన మందిరంలో టీపీయూఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖలో దీర్ఘకాలంగా పదోన్నతులు ఇవ్వక అనేక పర్యవేక్షణ, బోధన పోస్టులు ఖాళీగా ఉండి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారన్నారు. అనంతరం నూతన కార్యవర్గ బాధ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి హరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పర్వతం సంధ్యారాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి యామా రమేష్, అమరవాది బ్రహ్మచారి, శ్రీనివా సాచారి, తిరుమలేష్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, దేవరాజ్, రవికుమార్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న టీపీయూఎస్ కార్యవర్గ సభ్యులు

కోదాడ టు ఆంధ్రప్రదేశ్

రాష్ట్ర సరిహద్దు దాటుతున్న రేషన్ బియ్యం

- దళారుల అండతో యథేచ్ఛగా అక్రమ రవాణా
- అసలు సూత్రధారి ఏపీలోని షేర్‌మహ్మద్‌పేట వాసి
- అడ్డుకున్న వారిపైనే కేసుల బనాయింపు
- అక్రమ దందాపై దృష్టి సారించని ఉన్నతాధికారులు



మునగాలలో పట్టుబడిన రేషన్ బియ్యం

సాక్షి నిఘా

కోదాడ : కోదాడ నియోజకవర్గం రేషన్ బియ్యం అక్రమ దందాకు కేంద్రంగా మారింది. ఈ ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దుగా ఉండడంతో ఇక్కడి నుంచి భారీ ఎత్తున రేషన్ బియ్యం అక్రమంగా రవాణా అవుతున్నాయి. కోదాడ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న తమ్మర, చిలుకూరు మండలంలోని బేతవోలు, మునగాల మండలంలోని పలు గ్రామాలు కేంద్రంగా బియ్యం అక్రమ దందా జోరుగా సాగుతోంది. ఈ దందాలో ప్రధాన సూత్రధారి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పరిధిలో గల షేర్‌మహ్మద్‌పేటలో ఉండి ఇక్కడ చక్రం తిప్పుతూ తమ గ్రామంతోపాటు ఇతర ప్రాంతాలకు బియ్యం తరలిస్తున్నాడనేది బహిరంగ సత్యం. రేషన్ బియ్యాన్ని క్షేమంగా రాష్ట్ర సరిహద్దు దాటించడానికి కోదాడలోనే కొందరు దళారులు తయ్యారయ్యారు. అధికారులందరికీ మామూళ్లు ఇస్తూ ఈ దందాను కొనసాగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరిని ఎవరైనా అడ్డుకుంటే వారిపై దాడులు చేస్తూనే.. తమనే బెదిరించారని పోలీస్ కేసులు నమోదు చేయిస్తున్నారు.

ఏజెంట్లను పెట్టుకొని సేకరణ

కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామానికి ఏజెంట్లను పెట్టుకొని కేజీకి రూ.5 నుంచి రూ.7లు చెల్లించి బియ్యాన్ని సేకరిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఈ బియ్యాన్ని ఆటోలు, ఎక్సెల్ మోపెడ్లలో కోదాడతో పాటు శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న డంపుల వద్దకు చేరుస్తారు. అక్కడి నుంచి 50 కేజీల మూటలను కట్టి 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు ఆటోలో రాష్ట్ర సరిహద్దు దాటిస్తుంటారు. దీని కోసం వీరికి కేజీకి 2 రూపాయల కమీషన్ చెల్లిస్తున్నట్లు సమాచారం. బియ్యం అక్రమ దందా నడుపుతున్న వ్యక్తి గ్రామమైన ఏపీలోని షేర్‌మహ్మద్‌పేట.. తెలంగాణ సరిహద్దుకు 10 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో సులువుగా అక్కడికి బియ్యాన్ని చేరవేస్తున్నారు. పైగా ఆయన అనుచరులు కోదాడలో చాలామందే ఉండడంతో దందా యథేచ్ఛగా సాగుతోంది. దీనికితోడు కోదాడలో బియ్యాన్ని సేకరించే వారు కేవలం షేర్‌మహ్మద్‌పేటలో ఉన్న వ్యాపారికే అమ్మాల్సి ఉంటుంది. అలా కాదని ఇతరులకు అమ్మితే మరునాడే అతని బియ్యాన్ని పోలీసులు పట్టుకుంటారు. అతనిపై కేసు నమోదవుతుంది.

అడ్డుకుంటున్న వ్యక్తులపైనే కేసులు..

20 రోజుల క్రితం కోదాడ నుంచి దాదాపు మూడున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్న ఓ ఆటోను కొందరు ఆపారు. సదరు వ్యక్తి మరునాడు కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తాను బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తన సోదరి ఇంటికి తీసుకెళ్తుండగా ఓ నలుగురు ఆపి డబ్బులు ఇవ్వాలని బెదిరించారని ఫిర్యాదు చేశాడు. అయితే ఫిర్యాదు చేసిన వ్యక్తిపై గతంలో కేసు ఉన్నా దాన్నేమీ పట్టించుకోకుండా రాత్రికి రాత్రే వారిపై కేసులు నమోదు చేశారు. అయితే 20 రోజుల క్రితం తాను అమాయకుడినని పోలీసులకు ఫిర్యాదు చేసిన వ్యక్తే శుక్రవారం మునగాల నుంచి రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పోలీసులకు పట్టుబడగా అతనిపై కేసు నమోదైంది. చిలుకూరు మండలం బేతవోలులో ఓ వ్యాపారి బియ్యం రవాణా చేస్తున్న విషయాన్ని కొందరు శుక్రవారం రాత్రి సివిల్ సప్లయ్ అధికారులకు అందించినట్లు సమాచారం. దీంతో దాడి చేసి 140 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. మొత్తంగా ఈ అక్రమ దందాపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

నాలుగు నెలల కాలంలో పట్టుబడిన బియ్యం ఇలా..

- సెప్టెంబర్ 24న మునగాలలో 80 కింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా మునగాల పోలీసులు పట్టుకున్నారు.
- డిసెంబర్ 12న దోరకుంట వద్ద 40 క్వింటాళ్ల బియ్యం పట్టివేత.
- డిసెంబర్ 29న మునగాలలో 75 బస్తాల బియ్యం పట్టివేత.
- డిసెంబర్ 30న రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద140 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

నాలుగు చెక్‌పోస్టులు ఉన్నా..

ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ బియ్యానికి అడ్డాగా ఉన్న షేర్‌మహ్మద్‌పేట.. కోదాడకు 20 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. పైగా ఈ మార్గంలో చిమిర్యాల వద్ద ఆర్‌టీఏ చెక్‌పోస్టు, రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద పోలీస్ చెక్‌పోస్టు, గరికపాడు వద్ద ఏపీ పోలీస్ చెక్‌పోస్టు, అనుమంచిపల్లి వద్ద ఏపీఆర్‌టీఏ చెక్‌పోస్టుతో మొత్తం నాలుగు ఉన్నాయి. అయినప్పటికీ రేషన్ బియ్యం ఎక్కడ ఆగకుండా డంపునకు చేరుతున్నాయంటే దందారాయుళ్ల పలుకుపడి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

కఠిన చర్యలు తీసుకుంటాం



రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే గతంలో కేసులు నమోదైన వారిపై నిఘా పెట్టాం. బియ్యం అక్రమ రవాణా చేసిన, చేస్తున్న వారితో కుమ్మక్కై డబ్బులు డిమాండ్ చేసే వారిపై కూడా కేసులు నమోదు చేస్తాం. సమాచారం ఉన్న వారు పోలీసులకు తెలపాలి.

– వెంకటేశ్వర్‌రెడ్డి, డీఎస్పీ, కోదాడ

భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ

యాదగిరిగుట్ట: నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆదివారం మున్నూరుకాపు నిత్యాన్నదాన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో నాలుగు వేల మంది భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు చేతుల మీదుగా ప్రసాదం అందించినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పుప్పాల నర్సింహ, వేముల రవీందర్, మారిశెట్టి వీరయ్య, పలుగుల శ్రీనివాస్,సంఘం సత్తయ్య, పుప్పాల నరేష్, మారిశెట్టి వేణు తదితరులు పాల్గొన్నారు.

మైసూర్ మల్లికతో ఆదాయం అదుర్స్

- ఎకరం విస్తీర్ణంలో దేశవాళీ వరి వంగడం సాగుచేసిన రెడ్లకుంట రైతు
- ఎకరానికి 19 క్వింటాళ్ల దిగుబడి
- కేజీ బియ్యం రూ.80 చొప్పున విక్రయం

పాడి పంట

కోదాడరూరల్: మైసూర్ మల్లిక అనే దేశవాళీ వరి వంగడం సాగుచేస్తూ కళ్లు చెదిరే ఆదాయం ఆర్జిస్తున్నాడు కోదాడ మండల పరిధిలోని రెడ్లకుంటకు చెందిన రైతు చంద్ర వెంకటేశ్వరరావు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నుంచి మైసూర్ మల్లిక దేశవాళీ వరి విత్తనాలను తెప్పించి ఎకరం విస్తీర్ణంలో పంట సాగుచేసేందుకు నారు పెంచాడు. ఎకరానికి 8 నుంచి 10 కేజీల విత్తనాలు సాధారణ వరి సాగు పద్ధతిలోనే నాటు వేశాడు. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తూ ఎలాంటి పురుగు మందులు, దుక్కి మందులు వాడలేదు. అవసరమైనప్పుడు వేరుశనగ చెక్కను డ్రమ్ము నీటిలో నానబెట్టి దానిని బావిలో వదిలి ఆ నీటిని పంటకు అందించాడు.



రెడ్లకుంటలో రైతు వెంకటేశ్వరరావు సాగుచేసిన మైసూర్ మల్లిక దేశవాళీ రకం వరి పంట

తెగుళ్ల బెడద లేదు..

దేశవాళీ వరి వంగడం కావడం, సేంద్రియ సాగుకు నేల అనుకూలంగా ఉండడంతో పంటకు ఎలాంటి తెగుళ్ల సోకలేదని రైతు చంద్ర వెంకటేశ్వర్‌రావు తెలిపాడు. అదే విధంగా ఈ రకం వరికి వ్యాధినిరోధక శక్తి కూడా ఎక్కువ అని, గాలి దుమ్ముకు కూడా పంట నేలవాలలేదని పేర్కొన్నాడు. పైరు మూడున్నర అడుగుల ఎత్తు వరకు పెరిగిందని, ప్రస్తుతం వరి కోత పూర్తయ్యిందని, ఎకరంలో 19క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపాడు.

ఎకరానికి రూ.లక్ష పైచిలుకు ఆదాయం

మైసూర్ మల్లిక రకం బియ్యానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, ఎకరానికి 19 క్వింటాళ్లు వచ్చిందని, మిల్లు పట్టిస్తే క్వింటాల్‌కు 65 కేజీల చొప్పున మొత్తంగా 11క్వింటాళ్ల పైనే బియ్యం వచ్చిందని రైతు చంద్ర వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నాడు. ఈ బియ్యాన్ని కేజీ రూ.80 చొప్పున కోదాడలోని తన సేంద్రియ ఉత్పత్తుల షాపులోనే అమ్ముతున్నట్లు తెలిపాడు. ఎకరానికి వచ్చే 19క్వింటాళ్ల వరి ధాన్యాన్ని క్వింటాల్ రూ.8వేల చొప్పున అమ్మినా రూ.1,52,000 ఆదాయం వస్తుందని, పెట్టుబడి ఖర్చు రూ.30వేలు పోగా రూ.1.22లక్షల నికర ఆదాయం తప్పకుండా ఉంటుందని రైతు వివరించాడు.

రసాయన ఎరువులు వాడలేదు



గత ఐదేళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాను. మైసూర్ మల్లిక దేశవాళీ వరి వంగడం సాగుకు ఎలాంటి రసాయన ఎరువులు వాడలేదు. ఎకరానికి 11 క్వింటాళ్ల బియ్యం దిగుబడి వచ్చింది. ఆ బియ్యాన్ని కోదాడ పట్టణంలోని నా సేంద్రియ ఉత్పత్తుల షాపులో కేజీ రూ.80 చొప్పున విక్రయిస్తున్నాను. చాలా మంది ఈ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

–చంద్ర వెంకటేశ్వరరావు, సేంద్రియ రైతు, రెడ్లకుంట